పెరిగిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో బలగ శ్రీరామ్మూర్తి

విశాలాంధ్ర - గార : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతున్న విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని, సర్దుబాటు చార్జీలను ప్రజల పై రుద్దకుండా తక్షణమే రద్దు చేయాలని, ఇళ్లతో పాటు వ్యవసాయ బోర్లకు స్మార్ట్ విద్యుత్ మీటర్లను బిగించడం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా సిపిఐ కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే విధానాన్ని విరమింపజేయాలన్న సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా అఖిలపక్ష పార్టీ సభ్యులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని దాసరి నాగభూషణ్ క్రాంతి భవన్లో సిపిఐ టౌన్ సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై రకరకాల చార్జీల పేరిట రూ.50 వేల కోట్లు అదనపు విద్యుత్ భారాల్ని అన్ని వర్గాల ప్రజల పై జగన్ ప్రభుత్వం మోపుతుందని , వీటిని ఆపకుంటే మరో బషీరాబాగ్ ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వమే తెరతీసినట్లువుతుందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర బిజెపి పాలిత రాష్ట్రాల్లో సైతం స్మార్ట్ మీటర్లను, అక్కడి ప్రభుత్వాలు బిగించడం లేదని, జగన్మోహన్ రెడ్డి మాత్రం శ్రీకాకుళం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించడం తీవ్ర విచారకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అధికార , ప్రతిపక్ష పార్టీలు రాజధాని ఢిల్లీలో సాగిలపడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం గుద్దులాడుకుంటున్నట్లు నాటకాలడుతున్నారని విమర్శించారు. అందరూ ఒకటై తోడు దొంగలుగా మారి ప్రజలపై మాత్రం తీవ్ర భారాలతో విద్యుత్ ఛార్జీల పేరిట నిలువదోపిడీ చేస్తున్నారని, ఇటువంటి వాస్తవాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో తెలియపరచి వారిని చైతన్యవంతులను చేయాల్సిన గురుతర బాధ్యత పార్టీ శ్రేణుల పై ఉందని అన్నారు. ఇటువంటి నాయకులనా, ఆంధ్రప్రదేశ్ ప్రజలు కోరుకునేదని , ఒక్క ఛాన్స్ అని ప్రజలని నిత్యం వేదించడం నాయకుని లక్షణం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు మార్చుకోకుంటే ప్రజలే ఉవ్వేత్తున లేచి ఉద్యమాలు చేసే రోజులు దాపురిస్తాయని హేచ్చరించారు. ఈ నెల 30వ తారీఖున విద్యుత్ సమస్యల పరిష్కరాన్ని కోరుతూ సబ్ స్టేషన్ల వద్ద నిరసన కార్యక్రమల్ని చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె మోహన రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ బిల్లులను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిస్సిగ్గుగా బలపరుస్తుందని, వివిధ చార్జీల పేరిట ప్రజలపై భారాలు మోపడాన్ని రాష్ట్రంలోని 10 వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయని, తద్వారా ప్రజా పోరాటాలకు సిద్ధమవుతున్నాయని తెలియజేశారు. ప్రజలు వినియోగిస్తున్న విద్యుత్ వినియోగ రుసుమునే కాకుండా స్మార్ట్ మీటర్లను బిగించేందుకు కూడా ముందస్తుగానే బిల్లుల్లో నగదు జామచేసి వసూలు చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనించలన్నారు. అంతే ప్రజలు ఎక్కువ విద్యుత్ ను వినియోగిస్తే బిల్లులు అధికంగా వస్తున్నాయాన్నది అపోహ మాత్రమేనని, కేంద్ర ప్రభుత్వం విద్యుత్ను ప్రైవేట్ పరం చెయ్యడం మూలంగా ఈ పరిస్థితి దాపూరిస్తుందని ఆరోపించారు.గత రెండేళ్ల క్రితం వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగిస్తామని వైసీపీ ప్రభుత్వం ముందుకోస్తే, దానిని పెద్దాయత్తున శ్రీకాకుళం నగరంలోని సిపిఐ ఆధ్వర్యంలో అడ్డుకోవడం జరిగిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా పోయేదేమి లేదని కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విద్యుత్ సంస్కరణ పై అఖిల పక్షాల ఆధ్వర్యంలో ఉద్యమస్తామన్నారు.

సిపిఐ టౌన్ కార్యదర్శి డోల శంకర రావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రజకు ఇచ్చింది కేవలం పావలా అయితే తిరిగి పుచ్చుకునేది మాత్రం రూపాయని , దీనిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్లు ఇతర రాష్ట్రాల్లో తక్కువకి ఇస్తే ఆంధ్రప్రదేశ్లో మాత్రం చాలా ఎక్కువ మొత్తంలో వసూలు చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి కేసుల కోసం ప్రధాని మోదీ వద్ద చేతులు కట్టి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఇది ఎంతో కాలం చెల్లుబాటు కాదని ప్రజలు ఒక్కసారిగా తిరగబడే రోజులు ముందున్నాయని హేచ్చరించారు.

ఏఐటీయూసీ గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు, రాష్ట్ర ప్రయోజనాలను జగన్మోహన్ రెడ్డి తాకట్టు పెడుతూ విద్యుత్ సంస్కరణను మన రాష్ట్రంలో ప్రారంభించడం దురదృష్టకరమని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజలపై ఆర్థిక భారాలు వేసేలా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజా పోరాటాల ద్వారానే సమాధానం చెప్పాలని అన్నారు. నేటి విద్యుత్ సమస్యల పై క్షేత్ర స్థాయిలో ప్రజలను చైతన్య వంతులను చేయాల్సిన భాద్యత జిల్లా సిపిఐ పార్టీ నాయకత్వం పై ఉందని అన్నారు. పోరాటాలతో పాలకుల మెడలు వంచవచ్చునని అన్నారు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు వెలమల ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గ ప్రజలను పీల్చి, పిప్పి చేసేందుకు లక్ష్యంగా చేసుకున్నాయని, వారి ఆటలు కట్టించేందుకు ఎర్రజెండా చేతబుని తగిన బుద్ధి చెప్పేందుకు పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు సమయాతం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం తన ఆటపాటలతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులను చైతన్యపరిచారు. సిపిఐ సమితి సభ్యులు పట్టా ప్రభావతి మాట్లాడుతూ ఇంతకమునుపు ఇదే విధంగా విద్యుత్ ఛార్జీలను పెంచిన క్రమంలో తాము ఎన్నో ఉద్యమాలను చేపట్టి జైలుకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. ఇదే విధంగా జగన్ ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు రూపంలో ప్రజలను వేధిస్తే మరో విద్యుత్ ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఐ కార్యవర్గ సభ్యులు మద్దాడ యుగంధర్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను, వైసీపీ ప్రభుత్వం తగ్గించుకుంటే 2019 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుకు పట్టిన గతే జగన్మోహన్ రెడ్డికి పడుతుందని అన్నారు. రోజులో గంటగంటకు రుసుములలో మార్పులు చూపించి విద్యుత్ ఛార్జీలతో మోత మోగిస్తున్న, ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని యుగంధర్ అన్నారు. ప్రజలకు మేలు చేసే విధంగా పనిచేసే ప్రభుత్వాలు మునుగడ సాగిస్తాయని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు నిమ్మడ కృష్ణమూర్తి, సింతు యర్రయ్య, సిపిఐ కార్యవర్గ సభ్యులు లబ్బ యర్రమ్మ, పట్టా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పాలపోలమ్మ గుడి వద్ద ఉచిత అన్నదానం

అభివృద్ధి మండలి సభ్యులు

విశాలాంధ్ర - ఆమదాలవలస : శ్రీ పాల పోలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 27వ తేదీ మంగళ వారం ఆమదాలవలస కూర గాయల మార్కెట్ కిరాణా మార్కెట్ పట్టణ పెద్దల సహ కారంతో ఉచిత అన్న దానాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కెళ్ళి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ ఉచిత అన్నదానాన్ని భక్తులు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఈ మహా అన్నదాన ప్రసాదాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆయన ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి భక్తులు ఇచ్చే కాను కలను ఆలయం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. మంగళవారం నాడు అన్నదాన కార్యక్రమాన్ని అందరూ పాల్గొని కోరారు.

ఆరోగ్యవంతమైన ఆహార అలవాట్లు పాటించండి

విశాలాంధ్ర - పొందూరు : ప్రతి వ్యక్తులలో తరచుగా వస్తున్నా రోగాలను దృష్టిలో పెట్టుకుని వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యవంతమైన ఆహార అలవాట్లను తూచా పాటించాలని యంగ్ స్టార్స్ యూత్ క్లబ్ గౌరవ అధ్యక్షులు, ఎక్స్ జెన్కో డైరెక్టర్, జోలి వాకర్స్ సభ్యులు భాషా ఆనందమోహన్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగాణంలో జోలి వాకర్స్ సభ్యులకు నిర్వహించిన వైద్య పరీక్షల నిర్వహణలో పాల్గొని పై విధంగా అన్నారు. జోలి వాకర్స్ సభ్యులంతా వైద్యులు చెప్పిన సూచనలు పాటించాలని ఆయన అన్నారు. ప్రముఖ ఆయుర్వేదిక్ వైద్య నిపుణులు డాక్టర్ సునీల్ కుమార్, ప్రముఖ హెూమియోపతి వైద్య నిపుణులు డాక్టర్ విజయభాస్కరరావుల సౌజన్యంతో 45 మంది షుగర్ బిపిపరీక్షలు నిర్వహించారు. అవసరమైనరోగులకు ఉచితంగా మందులు అందించారు.వీరుతో పాటు స్థానిక లేబ్ టెక్నీషియన్ రమేష్ సహకారంతో రోగుల రక్త నమూనాలను సేకరించిపరీక్షా ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగాడాక్టర్ విజయ భాస్కర్, సునీల్ కుమార్ లు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి యోగాసనాలు దోహదపడతాయన్నారు. ఖైనీ పాన్ పరాగ్ వంటి మత్తు పదార్థాలకు దూరం కావాలన్నారు. ఆరోగ్య వంతమైన సమాజ స్థాపనకు జోలి వాకర్స్ ప్రచార రథసారథులు కావాలన్నారు. మాంసాహారాన్ని విడి మంచి విటమిన్స్ ఉండే పప్పు ఆకుకూరలను అలబాటు చేసుకోవడం పట్ల ఆరోగ్య వంతులు కాగలరన్నారు. ప్రతి పౌరుడు ఉప్పు కారం తీపి పదార్థాలు వీలైనంత వరకు తగ్గించుకొని దీర్ఘకాలిక ఆరోగ్యవంతులుగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అల్లం శెట్టికృష్ణారావు, రజనీ దంపతులు జోలి వాకర్స్ సభ్యులందరికీ అల్పాహార విందును అందించారు.

కొత్తూరులో పలు కార్యక్రమాల్లో ఎంపీ కింజరాపు

విశాలాంధ్ర - కొత్తూరు : మండలం లో ఆదివారం పలు కార్యక్రమాలు ప్రారంబొత్సవాల్లో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ముందుగా మాకువరం గ్రామంలో తన నియోజకవర్గ అభివృద్ధి నిధులు రెండు లక్షలు రూ లు తో నిర్మిచిన మంచినీటి పదకాన్ని ప్రారంభించారు అనంతరం మాకువరం.. విరణారాయనాపురం మధ్యన నున్నా గెడ్డపై 25 లక్షల రూపాయల ఎంపీ నిధులు తో నిర్మించిన కింజరాపును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం టీడీపీ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే కలమాట వేంకట రమణ, టీడీపీరాష్ట్ర కార్యదర్శి కలమాట సాగర్, టీడీపీ స్థానిక నాయుకులు పాత్రుకొండ మోహన్ రావు, నెల్లి అచ్చుత రావు, గార భాస్కరరావు రమేష్ తదితరులు పాల్గొన్నారు..

విశిష్ట వ్యక్తి బొడ్డేపల్లి రాజగోపాలరావు : రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన

విశాలాంధ్ర - అరసవల్లి : విశిష్ట వ్యక్తి బొడ్డేపల్లి రాజగోపాల్ అని, ఆయన శత జయంత్యుత్సవాలను వంద రోజుల పాటు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్స్ లో శత జయంత్యుత్సవాల ముగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసాదరావు మాట్లాడుతూ.. దేశానికి స్వతంత్ర వచ్చిన రోజుల్లో జరిగిన మొదటి ఎన్నికల్లో ఆయన తలపడ్డారు. సామాన్య కుటుంబంలో జన్మించి, ఆరు సార్లు పార్లమెంట్లో అడుగు పెట్టారని, ఎవరి దన్నూ లేకుండానే విజయ పథాన దూసుకుపోయారని, మూడు దశాబ్దాల పాటు ఆయన ఎంపీగా రాణించారన్నారు.

జిల్లా ప్రగతిలో ప్రముఖ పాత్ర నిర్వహించారని, గనుక సీఎం జగన్ ఆయన శత జయంతి ఉత్సవాలు ప్రభుత్వం తరఫున నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ఆ మేరకు జిల్లా ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వం కలిపి ఈ వేడుకలు నిర్వహించారన్నారు. ఆయన ఔన్నత్యాన్ని కొత్త తరానికి తెలిపేందుకు, ఆయన్ను ఆదర్శ గా తీసుకొని రానున్న తరాలు.. రాణించేందుకు వీలుగా,ఆయన్ను గుర్తు పెట్టుకునేందుకు వీలుగా వంశధార ప్రాజెక్ట్ కు బొడ్డేపల్లి రాజగోపాల్ పేరు పెట్టామన్నారు. ఆ రోజు నేను కూడా వైఎస్ఆర్ క్యాబినెట్లో ఉన్నాను. జిల్లా ప్రజల జీవన ప్రమాణాలు పెంచే ప్రాజెక్ట్ అది. ఆయన ఉంటుండగా, నాకు 26 ఏళ్ల వయస్సు ఉన్నపుడు, ఎమ్మెల్యేగా పోటీ చేయాలని నా రాజకీయ గురువు డోల సీతారాంకు చెప్పారు. అలానే పోలాకిలో నిర్వహించిన సమావేశంలో, ఎంపిపీగా పోటీ చేయాలని నాకు సూచించారు. స్థానిక సంస్థలలో పనిచేసిన ఆ అనుభవం నాకెంతో ఉపయోగపడిందన్నారు. 1989లో కేబినెట్ లో నాకొక స్థానం దక్కిందని, ఆ రోజు శుభాకాంక్షలు తెలిపి, ఇంకా పెద్ద స్థాయికి వెళ్ళాలని ఆకాంక్షించారని గుర్తు చేశారు. ఏదేమయినప్పటికీ ప్రజా క్షేత్రాన అరుదైన వ్యక్తులకే ఇలాంటి గౌరవం లభిస్తుందన్నారు. జిల్లా వెనుక బాటుతనాన్ని నివారించాలని సీఎం జగన్ 4 వేల కోట్లతో మూలపేట పోర్టు నిర్మాణం చేపట్టారని, బుడగట్ల పాలెం హార్బర్ నిర్మిస్తున్నారని, గడిచిన నాలుగేళ్లలో అనేక రంగాల్లో ఏపీ మొదటి స్థానానికి వచ్చిందన్నారు. నాలుగేళ్లలో అనేక రంగాల్లో ముందుకు వెళ్ళాము. మూలపేట పోర్టు పూర్తయితే అనేక మందికి ఉపాధి దొరుకుతుంది. బుడగట్లపాలెం హార్బరు పనులు పూర్తయితే మత్స్యకారులు వలస వెళ్లే అవసరమే ఉండదు. స్థానికంగానే ఉపాధి దక్కడంతో పాటే గుజరాత్ లాంటి వేరే రాష్ట్రాలకు పోయి సమస్యలు ఎదుర్కోవాల్సిన దుఃస్థితి ఉండదన్నారు. తొలుత వైఎస్సార్ కూడలి వద్ద బొడ్డేపల్లి రాజగోపాల్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక తదితరులు ఉన్నారు.

పురుషోత్తపురంలో ఒకేరోజు ఐదు దేవాలయాలు చోరీ

ప్రాథమిక ఆధారాలు కూడా దొరక్కుండా పగడ్బందీ ప్లాన్ కొన్ని రోజులు గస్తీ కాసి మరి చేసుంటారని స్థానికుల ఆరోపణ

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో దొంగలు హల్చల్ చేశారు. పురుషోత్తపురం గ్రామంలో గల శివాలయం, మందలమ్మ తల్లి పేరంటాలు, సంతోషిమాత ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, త్రినాథ స్వామి ఆలయాల్లో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఈ ఆలయాల్లో అర్ధరాత్రి దొంగలు దోపిడీకి పాల్పడ్డారు. శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో స్వామివారి కిరీటాలు, వెండి, వెండి వస్తువులు దొంగిలించారు.

శివాలయంలో పూజల కోసం ఉపయోగించే వెండి వస్తువులను దొంగల అపహరించారు. త్రినాథ్ స్వామి ఆలయంలో స్వామివారి బంగారు కళ్ళు, సుమారు కిలో వెండి కిరీటాలు దోచుకుపోయినట్లు ఆలయ అర్చకులు తెలియజేశారు. రాత్రి సమయంలో దొంగలు ఆలయాల్లో దోపిడీ సృష్టించడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి ఐదు ఆలయాల్లో దొంగలు పడటంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎస్సై కూటుకుల కృష్ణ ప్రసాద్ ఇచ్చిన సమాచారం మేరకు ఐదు ఆలయాల్లో ఒకే రాత్రి చోరీ జరిగిందని, ఎంత సంపద మరియు ఆభరణాలు చోరీ అయ్యాయి అనే విషయాలు దర్యాప్తు చేస్తున్నామని, పురుషోత్తపురం గ్రామానికి చెందిన పూజార కృష్ణ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని తెలియజేశారు. ప్రాథమికంగా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలియజేశారు. ఈ ఆలయాలను సరుబుజ్జిలి పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన మంత్రి ధర్మాన

విశాలాంధ్ర - అరసవల్లి : స్థానిక డే అండ్ నైట్ కూడలి నుంచి ఆమదాల వలస రైల్వే స్టేషన్ వరకూ చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు పరిశీ లించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ "ఈ రోడ్డుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. రైల్వే స్టేషన్ కు రాకపోకలు సాగించేవారికి అలానే వీరఘట్టం వైపు నుంచి రాయగఢ వెళ్లేవారికి, అలానే బత్తిలి నుంచి ఒడిశా వైపునకు వెళ్లే వారికి కూడా ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఈ రోడ్డు పనులు ఆర్ అండ్ బీ శాఖ నిర్వహిస్తోందని, ఈ రోడ్డుకు నలభై కోట్ల రూపాయలు మంజూరు చేశాం. త్వరగా చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రోడ్డును విస్తరించి వేస్తున్నాం. కొన్ని సమస్యలు ఉన్నాయి. జిరాయితీ ల్యాండ్ ఉంది. అలానే కొన్ని కట్టడాలు తొలగించాల్సి ఉందని తెలిపారు. ఇవన్నీ చేసి రోడ్డు వెడల్పు



చేస్తున్నామని, బలగ ప్రాంతం నుంచి రద్దీ ఎక్కువగా ఉందని, అక్కడ కట్టడాలు తొలగించాల్సి ఉందన్నారు. అలానే కొన్ని వాణిజ్య కూడళ్లు కలుపుకుని డే అండ్ నైట్ జంక్షన్ వరకూ పనులు చేస్తున్నామన్నారు. డిస్ట్రిక్ట్ జడ్జి నివాసానికి సంబంధించి గోడ కూడా తొలగించాల్సి ఉందన్నారు. అలానే ఆర్టీసీ కాంప్లెక్స్ కు సంబంధించిన గోడ కూడా కూల్చాల్సి ఉందన్నారు. వీటి స్థానంలో కొత్త వాటి నిర్మాణానికి దీనికి మున్సిపల్ నిధులు కేటాయించామన్నారు. ఇందుకు కోటీ పది లక్షల రూపాయలు నిధులు విడుదల చేశామన్నారు. టెండర్లు కూడా పిలిచాం. అలానే కొన్ని చోట్ల జనావాసాలు ఉన్న చోట్ల అభ్యర్థన మేరకు డబ్బై అడుగుల మేరకు రోడ్డు ఉంటుందన్నారు. మిగతా అంతా ఎనభై అడుగుల రోడ్డే వేయనున్నాం. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడే రోడ్డు పనులు చేస్తే అవి ఎక్కువ కాలం నిలబడతాయని, వానలున్నప్పుడు తారు రోడ్డు వేస్తే గాల్లో తేమ కారణంగా ఆ పనులు నిలబడవని, కావునా నాణ్యతను ప్రామాణికంగా తీసుకుని పనులు చేస్తున్నాం అని పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నాను అని మంత్రి ప్రసాదరావు పేర్కొన్నారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేశు, అర్అండ్‌బి ఎస్ఈ సుధాకర్, ఈఈ రవి నాయక్, డిఈ గణపతి, ఎఈఈ రాజు, సాదు వైకుంఠ రావు, చిట్టి జనార్దన రావు, అల్లు లక్ష్మి నారాయణ, రెడ్డి చిరంజీవులు, బాన్న రమణ, గణపతి పట్నాయక్, గుండ హరీష్, నాగ బుషన్, ఎండ రమేష్, సీర సత్యం, ఎండ రమేష్, టంకాల బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రక్తదానం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేటకు చెందిన స్పెషల్ గ్రైయ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ తుంగాన వెంకటేశం, డాక్టర్ పెద్దింటి దుర్యోధన, డాక్టర్ ప్రసన్నకుమార్‌లు హాజరై ప్రారం భించారు. వివిధ గ్రామాల నుంచి రక్తదాతలను ఆహ్వానించగా వారంతా సకాలంలో విచ్చేసి ఈ శిబిరంలో పాల్గొని వైద్యుల పర్య వేక్షణలో రక్తదానం చేశారు. దురదృష్టవశాత్తు ప్రమాదాలకు గురైన బాధితులకు ప్రసవ సమయంలో గర్భిణీ స్త్రీలకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రక్తం అందించాలన్న ఏకైక లక్ష్యంతో ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రి, రిమ్స్ వైద్య సిబ్బంది రక్త సేకరణ చేపట్టారు. స్థానిక ల్యాబ్ టెక్నీషియన్ శ్యాం సహకరించారు.

గ్రంథాలయాలతోనే భవిష్యత్ విజయాలు

విశాలాంధ్ర - రణస్థలం : శాఖ గ్రంథాలయం లో ఇటీవల జరిగే ఉచిత వేసవి శిక్షణ తరగతులలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థుల్లో జి జయశ్రీ అనే విద్యార్థిని ఇటీవల జి 20 లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాళు కండక్ట్ చేసిన పరీక్ష విధానంలో తృతీయ స్థానాన్ని పొందడం జరిగింది. దానికి కారణం గ్రంథాలయంలో ఉండే పుస్తకాలను చదవడం వలన సాధ్యమని చెప్పడం జరిగింది. ఆర్ ధర్మారావు విశ్రాంతి ఉపాధ్యాయులు, పి సూర్యనారాయణ (108) ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలే కాకుండా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే అన్ని రకాల పుస్తకాలలో పాటు గొప్ప వ్యక్తుల అనుభవాలు వాళ్ల స్ఫూర్తిని పొందుతారని ప్రతి ఒక్కరూ గ్రంథాలయం వినియోగించు కోవాలని కోరారు. భవిష్యత్తులో మంచి విజయాలను చేకూరుస్తుందని చెప్పడం జరిగిందని, తదనంతరం విద్యార్థులు చదవడం మా కిష్టం కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయ దగ్ధం

అగ్నిప్రమాదంపై పలు అనుమానాలు

విశాలాంధ్ర - పొందూరు : పొందూరు మండల పాత ఎంపీడీవో భవనంలో ఆదివారం మధ్యాహ్నం హఠాత్తుగా మంటలు చెలరేగి దగ్ధమైంది. కార్యాలయం వెనుక భాగంలో వీధుడు గాలులకు పైకప్పు పై మంటలు చెలరేగడంతో ముందు నుండి వెళ్లే చూపరులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడం సరవేగంగా సిబ్బంది వాహనాలతో చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికి ఆఫీసులో ఉన్న రికార్డులు ఖాళీ బూడిద అయ్యింది. ఆదివారం సెలవు దినం కావడం కారణంగా సిబ్బంది ఎవరు లేరు. రికార్డు రూము వైపే పూర్తి కాలిపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ షార్ట్ సెక్యూట్ అని చెబుతున్నా షార్ట్ సెక్యూట లేదా కావాలని ఎవరైనా చేసుంటారా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అగ్నిప్రమాదంపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడవలసి ఉంది.

ఉపాధ్యాయ బదిలీల్లో లోపాలు సరిచేయాలి

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ఉపాధ్యాయ బదిలీల్లో కొన్ని లోపాలు జరిగాయని వాటిని వెంటనే సరిచేయ్యాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని ఆనందరావు కోరారు. నగరం లో ఆదివారం అపస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత బదిలీల్లో జిల్లా కలెక్టర్, కమిటీ సభ్యులు అప్రూవ్ చేసిన ప్రిఫరెన్సియల్ కేటగిరీ అభ్యర్థుల జాబితాను ఆ కేటగిరీ లో ఉంచి బదిలీలు చేయటం లో జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, దీంతో అనారోగ్యం తో బాధపడుతున్న వారు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, సమస్య పరిష్కారం కోసం అధికారులకు పెట్టుకున్న అర్జీలకు స్పందించి వారికి తక్షణమే బదిలీ సవరణ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నర్సింగరావు మాట్లాడుతూ ప్రస్తుతం జరిగిన బదిలీ లతో చాలా మంది ఉపాధ్యాయుల కు నష్టం జరిగిందని, జరిగిన తప్పులను సరిదిద్ది సవరణ చెయ్యాలి అన్నారు. సవరణ ఉత్తర్వులు ఇవ్వటం లో జిల్లా విద్యాశాఖ అధికారులు అలసత్వం వహించటం వలన తీవ్ర గందర గోళం పరిస్థితులు నెలకొన్నాయి అని, వెంటనే జరిగిన తప్పులను గుర్తించి న్యాయం చేయాలని లేని పక్షం లో ఉద్యమ బాట పట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అపస్ నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అపస్ జిల్లా కార్యదర్శి చెలపాక రమణ, సభ్యులు రాంబాబు, పావయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి చేయూత

విశాలాంధ్ర - కవిటి : మండల కేంద్రంలోని కవిటి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థినికి శ్రీ చింతామణి అమ్మవారి ట్రస్ట్ హైదరాబాద్, కవిటి తరుపున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కవిటి గ్రామానికి చెందిన దుమ్ము రజనీ అనే నిరుపేద విద్యార్థిని సోంపేట హాస్టల్ లో వుండి ఇంటర్ చదువుతుంది. ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు కొన్ని అందుతున్నాయి. హాస్టల్ ఫీజులు నిమిత్తం 10 వేల రూపాయలు విద్యార్థిని తల్లికి స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు,మండల కో ఆప్షన్ సభ్యులు, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమం లో బి.రమణ మూర్తి, పోల్లాయి ఉమ మహేశ్వరరావు, బావన రవి, కే.ముకుంద రావు, కే.జ్ఞానసంద్, పిన్నింటి జయరావు, జన్ని లోకానాథం, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు అమాత్యులకు పట్టవా..?

సాగునీటి సమస్యపై జడ్‌పిలో ఎంపీపీ తెగువ భేష్

జనసేన నియోజకవర్గం నాయకుడు దుర్గారావు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : వంశధార శివారు భూములకు నాలుగేళ్లుగా సాగునీరు అందడం లేదు, జీడి పిక్కలకు మద్దతు ధర లేదు, రైతాంగ సమస్యలు అమాత్యులకు పట్టవా అని జనసేన నియోజకవర్గం నాయకుడు డాక్టర్ వి.దుర్గారావు విమర్శించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలాస ఎంపీపీ ప్రవీణ వంశధార శివారు భూములకు సాగునీరు అందకపోవడం పై ప్రశ్నించడం ప్రశంసనీయం అన్నారు. సాగునీటి సమస్యపై ఒక ఎంపీపీ కి ఉన్న శ్రద్ధ మంత్రి సీదిరికి లేకపోవడం బాధాకరమన్నారు. అధికారులను ఆదేశించే స్థాయిలో మంత్రి డా. సీదిరి ఉండి కూడా నాలుగేళ్లుగా వంశధారనీరు అందక రైతులు అల్లాడుతుంటే మంత్రి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. శివారు గ్రామాలు బెండి, పెద్దబొడ్డపాడు, సీతాపురం, తాడివాడ, కిడిసింగి, కొండవూరు పరిధిలో వంశధార నీరు నాలుగేళ్లుగా అందడం లేదు. సాగునీటి సమస్యపై స్పందించకపోవడం రైతులంటే మంత్రికి ఉన్న ద్వేషం తేటతెల్లం చేస్తుంది అన్నారు. జీడి పిక్కలకు మద్దతు ధర లభించక ఉద్దానం రైతు కుదేలవుతుంటే మంత్రి ప్రకటన చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో జీడి రైతులు, వ్యాపారుల సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం తరుపున 1000 రూపాయలు రైతులకు చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతుల ఓట్లుతో గెలిచి ఆ రైతుల సమస్యలను గాలికి వదిలేయడం మంత్రి సీదిరికే చెల్లింది అన్నారు. పలాసలో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రైల్వే గేటు దగ్గర దారిన పోయే వారికి కండవాలు వేయడానికి పోటీలు పడుతున్నారని ఎద్దేవా చేసారు. రాజకీయంగా ఎత్తులు పై ఎత్తులు వేయడంలో ఉన్న శ్రద్ధ రైతులు సమస్యలపై చూపాలని హితవు పలికారు. వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీలకు ప్రజాగ్రహం చవిచూస్తారని డాక్టర్ దుర్గారావు హెచ్చరించారు.

రాధాకాంత పార్కులో ఆక్రమణలు తొలగించండి



విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మునిసిపాలిటీ 12వ వార్డు పరిధి రాధాకాంత పార్కు లోపల ఆక్రమణ లు తొలగింపు చర్యలు చేపట్టాలని ఆప్రాంత ప్రజలు, పెంట పోలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం మునిసిపల్ చైర్మన్ బల్ల. గిరిబాబు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బి.షణ్ముఖ, ఎస్.భగీరథి, ఎస్.రవి, ఎస్.గిరి మాట్లాడుతూ రాధాకాంత పార్కు పరిసరాలు ఆహ్లాదకరంగా వుండేదని నేడు అటువంటి పరిస్థితి లేదన్నారు.పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. పార్కు పక్క నుంచి గ్రామ దేవత పెంట పోలమ్మ ఆలయం కు వెళ్ళే దారిలో మూగజీవులను రహదారి మధ్యలో అడ్డదిడ్డంగా కట్టడంతో అనేక ఇబ్బంది లు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఆలయానికి నిత్యం వందలాది మంది భక్తులు దర్శనంకు వస్తుంటారని రహదారి మధ్యలో పేడ, చెత్త, చెదారం తో నడవడానికి కుడా వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సమీప పార్కు కు నిత్యం వందలాది మంది సేద తీరేవారని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఆహ్లాదాన్నిచ్చే రాధాకాంత పార్కు పరిసరాలులో ఆక్రమణలు తొలగించి, మూగ జీవులను కట్టకుండా చర్యలు చేపట్టాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే స్థానిక ప్రజలు, యువకులతో కలసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రంలో ఎస్.రూపు సుందర్, కే.నాగరాజు, వి.వెంకటరావు, సి.హెచ్. శ్రీనివాసరావు, ఆలయం అభివృద్ధి కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : రైతులకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుందని బోరుభద్ర సర్పంచ్ బుసకల లక్ష్మీ కాంతం, ఎంపిటిసి ప్రతినిధి చింతాడ చిన్నారావు అన్నారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీ పై మంజూరు చేసిన వారి విత్తనాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సాగు ముందుగా ప్రభుత్వం రైటుభరోసా కేంద్రాలు ద్వారా సరఫరా చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

జగనన్నకు చెపుదాంలో దిమిలి కిడ్నీ సమస్య

విశాలాంధ్ర - కొత్తూరు : మండలం దిమిలి గ్రామంలో పలువురు కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్న సమస్యను మండల పరిషత్ వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసివర ప్రసాద్ రావు జగనన్నకు చెపుదాం కార్యక్రమం ద్వారా సీఎంఓ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించారని ఇక్కడ మీడియాకు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తెలిపారు. సోమవారం రాగోలు జేమ్స్ ఆసుపత్రికి చెందినడాక్టర్స్ టీమ్, దిమిలి గ్రామాన్ని రానుందని ఈ సమస్యా పై జిల్లాకలెక్టర్‌కు సోమవారం గ్రీవేన్స్‌లో వివరించి ఒక మెమోరాండం అందజేస్తామని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తెలిపారు.

తీవ్ర అస్వస్థకు గురైన జడ్పీ చైర్‌పర్సన్ విజయ

విశాలాంధ్ర - కవిటి : శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని జడ్పీ బంగ్లాలో జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ తీవ్ర అస్వస్థకు గురి కావడంతో అత్యవసర చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని కిమ్స్ హాస్పిటల్ కి తరలించారు. ఈ మేరకు ఆదివారం పలు కార్యక్రమాలలో పాల్గొని జడ్పీ బంగ్లాకు చేరుకునే సమయానికి జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ తీవ్ర అస్వస్థత గురి కావడంతో కిమ్స్ హాస్పిటల్ కు తరలించి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

నిరుపయోగంగా ప్రయాణికుల విశ్రాంత భవనం

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రంలో ప్రయాణికుల కోసం నిర్మించిన విశ్రాంతి భవనం నిరుపయోగంగా వదిలేయడంతో శిథిలావస్థకు చేరుకుంది. మూడు దశాబ్దాల క్రితం చల్లవానిపేట, జలుమూరు ప్రధాన రహదారి పక్కన జలుమూరు మండల కేంద్రంలో ప్రయాణికుల కోసం విశ్రాంతి భావన నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం పాడి పశువులకు నిలయంగా మారిపోయింది. అధికారులు స్పందించి ఆక్రమణకు గురవుతున్న భవనాన్ని వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్వర్గ ధామంకు వెళ్లేందుకు ఎన్ని కష్టాలో..!

విశాలాంధ్ర - పలాస : స్వర్గ ధామం లో అంతిమయాత్ర నిర్వహించా లన్నా ఆ కాలనీ వాసులు పునాదులు దాటించి అతి కష్టంపై రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఉంది. ఇదేదో మారు మూల గ్రామంలో ఉన్న ఇబ్బందులు కాదు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటి పరిధి 15. 16 వార్డుల మధ్యలో ఉన్న నెహ్రూనగర్ కాలనీ వాసుల ఇక్కట్లు ఇది. నెహ్రూనగర్ పెద్దవీధికి సమీపంలో పాత సినిమాహాలు వెనుక భాగాన ఈ కాలనీ ఉంది. ప్రస్తుతం 30 వరకూ కుటుంబాలు నివసిస్తుండగా మరో 40 మందికి చెందిన ఇండ్ల స్థలాలు ఇక్కడ ఉన్నాయి. రహదారి పూర్తిగా లేకపోవడంతో మూడు అడుగుల స్థలం అంటే మురుగు కాలువ గట్టుపై నుంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. వాహనాలు వెళ్లాలంటే నిర్మాణంలో ఉన్న పునాదులు దాటించి కాలనీకి చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. వాస్తవానికి కాలువ గట్టు ఆరు అడుగుల వెడల్పు ఉండేదని అక్కడి నివాసస్తుల దస్త్రాలు చెబుతున్నాయి. ఆక్రమణల కారణంగా ఆరు అడుగులు కాస్త మూడు అడుగులు మిగిలింది. రహదారి కావాలని స్థానికులు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. దాతలు, కాలనీ వాసుల మధ్య చిన్నపాటి పొరపొచ్చాల కారణంగా రహదారికి అడ్డంకి ఏర్పడింది. ప్రస్తుతం కాలనీలో తాజాగా ఆదివారం ఓ యువకుడు మృతి చెందితే శవయాత్ర నిర్వహించడానికి అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. దీనికి తోడు వర్షం కురవడంతో పునాదుల మీదుగా బురదలోనే నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు, పాలకులు తక్షణం స్పందించి కాలనికి రహదారి. ఎ కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎట్టకేలకు ముందుకు ఏఎంసీ పాలక మండలి ఫైల్

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు : హిరమండలం, ఎల్.ఎన్.పెట మండలాలకు సంబంధించిన హిరమండలం వ్యవసాయ మార్కెట్ పాలకమండలి నియమాకానికి మరో కొద్దీ రోజుల్లో మోక్షం కలగనుంది. ఈ ఏడాది జనవరి 31 తేదీతో గోగుల మాధవి చైర్మన్ గా ఉన్న పాలక మండలి పదవీ కాలం ముగిసింది గత 5 నెలలుగా హిరమండలం ఎఎంసి చైర్మన్‌తో పాటుపాలక మండలి నియమాకం జరగలేదు ఎఎంసి పాలకమండలి నియమాకానికి స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే సిఫార్సు ఉండాలి అయితే పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి ఇందుకు సంబంధించి గతమే నెలలో కమిషనర్ వ్యవసాయ, మార్కెట్ శాఖకు కొత్తూరు మండలం కు చెందిన సారిపల్లి నిరోషా చైర్మన్‌గా ఉండే ప్రతిపాదనలు పంపంచారు. అయితే ఇక్కడ అధికార పార్టీ లో విభేదాల నేపథ్యంలో ఈ ఫైల్ కమీషనర్. స్థాయిలో ఆగిపోయింది ఈ ప్రతి పాదనలు మార్చే ది లేదని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పట్టు పట్టడంతో నాలుగు రోజుల క్రితం ఈ ప్రతి పాదనలు ఫైల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ అసిస్టెంట్ డైరెక్టర్ (" ఏడి మెర్కెట్)కు చేరిందని సంబంధిత వర్గాలు ద్వారా తెలుసింది ఇక మరి కొద్ది రోజుల్లో హిరమండలం ఎఎంసి చైర్మన్ గా ఉండే పాలక మండలి నియమాకాలకు అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయని ఆ వర్గాలు తెలిపాయి.

అర్హులందరికీ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యం

విశాలాంధ్ర - పాతపట్నం : అర్హుల అందరికీ శత శాతము ప్రభుత్వ పథకాలను అందజేయని ఈ ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని అందుకుగాను జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ చరిత్రలోనే రాష్ట్రంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు గూర్చి అడిగి తెలుసు కొని సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తూ పరిపాలన సాగిస్తున్న ఏకైక ప్రభుత్వం మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని అన్నారు. అర్హత కలిగి ఉండి ఎ కుటుంబం అయినా ఫలానా ఫలానా పథకము అంద లేదని చెప్పే అవకాశం ఉండ కూడదని విధముగా సమస్యలను పరిష్కరించాలన్నదే జగనన్న ధ్యేయమని అందులో భాగముగా ప్రతి ఇంటికి జల్లెడ పట్టి అర్హులైన వారిని గుర్తించి పథకాలే కాకుండా సచివాలయాల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న తొమ్మిది రకాల డాక్యు మెంటేషనులను అంద జేయటమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం అని అన్నారు. ఈ కార్య క్రమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్తూ ఇందులో భాగంగా ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం జగనన్న సురక్ష అని అన్నారు. గ్రామాల్లో వాలంటర్లు, గృహ సారధులు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించ బడుతుందని అన్నారు. దీని ద్వారా శత శాతం అర్హులకు ప్రభుత్వ పథకాలు గుర్తింపు చేయటం వారికి అవసరమైన ధృవీకరణ పత్రాలను అందజేయడం, ప్రజల సమస్యలను పరిష్క రించడ మే ప్రధాన లక్ష్యముగా పనిచేయటం జరుగుతుందని అన్నారు. వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఆధ్వర్యంలో వారి వారి క్ల స్టర్ల పరిధిలో గల ప్రతి ఇంటి ని సందర్శించి ప్రభుత్వ పథకాల పత్రాలకు సంబంధించిన సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కావలసిన పత్రాలను వెంట వెంటనే సేకరించటం జరుగు తుందన్నారు. సేకరించిన తర్వాత ఏడవ రోజు సచివాలయాల పరిధి క్యాంపు నిర్వహించి వారి సమస్యలను పరిష్క రించడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా మండల స్థాయి అధికారులు ప్రతి సచివాలయం లో ఒక్కోరోజు పర్యటించి అక్కడి కక్కడే పథకాలు లేదా ధ్రువీకరణ పత్రాల సమస్యలను పరిష్కరించి ఎటువంటి సేవా రుసుము లేకుండా అదే రోజు లబ్ది దారులకు అర్హత పత్రాలను అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై ఆసక్తి చూపని రైతన్న.. రైతాంగానికి ప్రొత్సహం కరువు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండలంలో కూరగాయల సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ అధికారుల నుంచి ప్రోత్సహం కొరవడడంతో రైతాంగం అనాసక్తి చూపు తున్నారు. కూరగాయలు పండించే రైతులకు 75 శాతం రాయితీ కల్పి స్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి నప్పటికీ అది ఎక్కడా వర్తించిన దాఖలాలు కనిపించటం లేదు. అయితే ఈ సీజన్‌లో రైతులు వరి సాగు పై దృష్టి సారించటంతో మండలంలో కూర గాయల సాగు తగ్గుముఖం పట్టింది. మండలంలో చీపుర్లపాడు, రేగులపాడు, కురుడు, కొత్తపల్లి, అక్కయ్యవలస, సొడాం, శ్రీజగన్నాథపురం, తర్లిపేట, చిన్న బమ్మిడి, వాండ్రాడ, హరి శ్చంద్ర పురం, కోటబొమ్మాళి పంచా యతీల పరిధిలో సుమారు 250 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. వరి కంటే అధికలాభాలు చేకూర్చే ఈ పంటపై రైతులు శ్రద్ధ చూపినప్పటికీ, వాటిని ఎగుమతి చేసే అవకాశం లేక సమీపంలో నున్న చీపుర్లపాడు మార్కెట్‌కు కావళ్లతో మోసుకుపోయి ఎంతో కొంత రేటుకు అమ్ముకుంటుంటారు. దీన్ని ఆసరాగా తీసుకున్న దళారులు అందరు ఒక్కటై తక్కువ రేట్లకు కొని ఇష్టాను సారంగా రేట్లు పెంచి వినియో గదా రులను దోచుకుంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో బీర, బెండ, పొడవు చిక్కుడు సాగు అధికంగా ఉంది, మిగిలిన కార గాయల పంటలు ఎండకాలం కారణంగా అంతంత మాత్రంగానే పండిస్తున్నారు. అయితే చీపుర్లపాడు ప్రధాన ఎగుమతి కేంద్రంగా సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, జలు మూరు, సారవకోట మండలాల నుండి రైతులు నుండి కొనుగోలు చేసిన కూర గాయలు చీపుర్లపాడు జాతీయ రహదారి జంక్షన్ వద్దకు చేర్చి అక్కడ నుండి ఇచ్ఛాపురం, బరంపురం, కటక్ వంటి సూదూర ప్రాంతాలకు లారీల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. కూర గాయలు సాగును ప్రోత్స హించేందుకు ఉద్యాన వనశాఖ ఎలాంటి శ్రద్ధ కనబరచక పోవడం పట్ల రైతులల్లో అవగాహన కొరవడింది అలాగే జాతీయ రహదారి ప్రక్కన శీతల గిడ్డంగి కేంద్రం నియమించాలని ప్రభుత్వాన్ని కోరు తున్నారు. మండలంలో కూర గాయాలు సాగు అధికంగా ఉన్నప్పటికీ ప్రభుత్వ పరమైన ప్రోత్సహం కొరవడింది. ఉద్యానవన శాఖ అధికారులు జాడ మచ్చుకైనా కనిపించదు. ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేసిన దాఖలాలు లేవు. ఈ ప్రభుత్వమైన కూరగాయల రైతులకు అండగా ఉండి సబ్సిడీ పై విత్తనాలు, ఎరువులు అందించేందుకు కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

తోటవీథికి వీడని విద్యుత్ కష్టాలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : జిల్లా ప్రధాన కేంద్రమైన శ్రీకాకుళం నగరంలో విద్యుత్ కోతలు సాధారణ విషయంగా మారాయి. అందులో నగర పరిధిలోని గుజరాతిపేట సమీపంలోని తోటవీధి నేటికీ టౌన్ ఫీడర్ నుండి విద్యుత్ సరఫరా జరగక పోతుం డడంతో ఈ ప్రాంత వాసులు నిత్యం నరకం చూస్తున్నారు. చిలకపాలెం సబ్‌స్టేషన్ లో విద్యుత్ కొరత లేదా ఇతర సాంకేతిక కారణాలను ప్రతినిత్యం సాకుగా చూపించి తోటవీధి ప్రాంతంలో ఇష్ట రాజ్యంగా విద్యుత్ కోతలకు పాల్పడు తున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు విద్యుత్ కోతలు లేవని ప్రకటనలు చేస్తుండగా నిత్య కృత్యంగా మారిన కరెంటు కోతలతో తోట వీధి ప్రాంత ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలకు గురవుతున్నారు. నిరంతర విద్యుత్తుకు ప్రభుత్వం ఆదేశాలు ఇస్తున్నప్పటికీ దిగువ స్థాయి సిబ్బంది మరియు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు రేయింబవళ్లు కరెంటు కోతలతో అవస్థలు పడుతూ వివిధ రకాల వ్యాధులకు గురవు తున్నారు. తాజాగా శుక్రవారం రాత్రి సుమారు 9:30 గంటల ప్రాంతంలో విద్యుత్తు సరఫరాను నిలిపివేసిన సిబ్బంది అర్ధరాత్రి దాటినప్పటికీ కరెంటును పునరుద్ధరించక పోవడంతో తోట వీధి పరిసర ప్రాంతాల ప్రజలు ఒకవైపు దోమ కాట్లు మరోవైపు చిమ్మ చీకట్లతో బిక్కు బిక్కుమంటూ కాలం గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే సమ యంలో ఈ ప్రాంతంలో ఇటీవల పలు చోరీ సంఘటనలు కూడా జరగడంతో ప్రజలు తీవ్ర భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఇందుకు కరెంటు కోతలు కూడా తోడవడంతో నిప్పుకు గాలి సహకరించినట్లు ఇక్కడి పరిస్థితులు ఉన్నాయని విద్యుత్తు వినియోగదారులు తీవ్ర ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తున్నారు. అటు పి ఎన్ కాలనీ ఇటు ఫాజిల్ బాగ్ పేట మరోవైపు గుజరాతి పేట ప్రాం తాలు టౌన్ లీడర్ పరిధిలో ఉన్నప్పటికీ మధ్యలో ఉన్న తోట వీధి ప్రాంతం మాత్రమే రూరల్ విద్యుత్తు ఫీడర్ పరిధిలో ఉండడం వెనుక సంబంధిత శాఖ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం మరియు వినియోగదారుల సేవల్లో అల క్ష్యాన్ని ప్రతిబింబిస్తోందని ఈ ప్రాంత వాసులు దుమ్మెత్తి పోస్తున్నారు. గతంలో పిఎన్ కాలనీలో ఈ ప్రాంతాన్ని టౌన్ ఫీడర్లో చేర్చేందుకు గాను సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలను చేపట్టినప్పటికీ స్థానికులు అంగీకరించకపోవడంతో ఈ ప్రతి పాద నలు అటకెక్కినట్లు వినికిడి. ఇదే సమ యంలో పిఎన్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ రిజర్వు స్థలాలు ఉన్నప్పటికీ సబ్ స్టేషన్ ఏర్పాటుకు యంత్రాంగం తదుపరి ప్రయత్నాలను చేయకుండా మీ కర్మ మీరు అనుభవించండి అన్న విధంగా వ్యవహ రించడంతో ప్రస్తుతం తోట వీధి మరియు పరిసర ప్రాంత గృహ విద్యుత్ వినియోగదారుడు నిత్య నరకాన్ని చవిచూస్తున్నారు. శుక్రవారం నాటి విద్యుత్ అంతరాయం విషయమై పలువురు విద్యుత్ విభాగం సిబ్బందితో పాటు అధికారులను కూడా సంప్రదించి నప్పటికీ ఒంటిగంట ప్రాంతంలో విద్యుత్తు వస్తుందని ప్రస్తుతం 33 కెవి లైన్ మరమ్మత్తు పనులు జరుగుతు న్నాయని సుమారు 10 గంటల సమ యంలో తెలియజేసినప్పటికీ అర్ధరాత్రి ఒంటిగంట దాటినప్పటికీ విద్యుత్తు పునరుద్ధరణ జరగలేదంటే వీరి పనితీరు, వినియోగదారులకు వీరు అందిస్తున్న సేవలను ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అత్యవసర విభాగం జాబితాలో ఉండి వినియోగ దారులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాల్సిన విద్యుత్ విభాగం సిబ్బంది పనితీరులో నిర్లక్ష్య ధోరణిని విద్యుత్తు వినియోగదారులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తో పాటు విద్యుత్తు విభాగం సూపరిండెండెంట్ ఇంజనీర్ తక్షణం స్పందించి తోట వీధి పరిసర ప్రాంత విద్యుత్తు సమస్యలపై దృష్టి సారించారని ఈ ప్రాంత ప్రజలు వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

తరుగుతున్న కొండలు...తరలి పోతున్న కంకర

పట్టించుకోని సంబంధిత అధికారులు..!

విశాలాంధ్ర - పలాస : పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కంకర మాఫియా రోజు రోజుకూ పెచ్చుమీరుతోంది. కొండలు అమాంతంగా కరిగిపోగా కంకర అనధికారికంగా తరలిపోతుంది. బహిరంగంగా, ఇష్టాను సారంగా కంకర తవ్వకాలు చేపట్టి, కొండలను కరిగేస్తున్నారు. ట్రాక్టర్లతో రాత్రి. పగలు తేడా లేకుండా కంకర తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం చెల్లించకపోవడంతో భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. పలాస మండలంలోని నెమలికొండ, కాశీబుగ్గ ప్రాంతాల్లో ప్రభుత్వ కొండలను భారీ యంత్రాలతో తవ్వి పిండి చేస్తున్నారు. రూ. లక్షలు విలువచేసే కంకరను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ స్థలాలు కొండ ప్రాంతాల్లో కంకర తవ్వకాలు చేపట్టాలంటే ముందస్తుగా రెవెన్యూ మైన్స్ అధికారుల నుంచి అనుమతి పొందాలి. ప్రభుత్వానికి చలానా రూపంలో డబ్బులు చెల్లించాలి. కానీ, కంకర మాఫియా వ్యక్తులు ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటు న్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అటు ప్రభుత్వ పరంగా, ఇటు అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా కంకర తవ్వకాలు చేపడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. హుదూద్ నివాస గృహాల వెనక వైపు భారీ యంత్రాలలో పట్టపగలే తవ్వకాలు చేపడుతున్నారు. పలాస మండలం రామకృష్ణాపురం, నీలిభద్ర, కొండ ప్రాంతాల్లో జోరుగా కంకర తవ్వకాలు చేపడుతున్నారు. రోజుకు వంద లోడులు వరకు కంకర తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక లోడు కంకర రూ.600 నుంచి రూ.800 వరకు ధర పలుకుతోంది. ఈ విధంగా రోజుకు రూ. లక్ష వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి రాత్రి, పగలు తేడా లేకుండా కంకర తరలించేందుకు ముందుగా రూ. లక్షల్లో బేరం కుదుర్చుకుంటున్నారు. అనుకున్న సమయానికి అక్రమంగా కంకర తరలించి, కంకర మాఫియా సొమ్ము చేసుకుంటున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి.

రామకృష్ణాపురంలో కరిగిన కొండ

ఈ ప్రాంతం లో రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతుండడం తో పంట భూములను లే అవుట్లుగా మార్చే ప్రాంతాల్లో మట్టితో పాటు కంకర తరలిస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వానికి చేరాల్సిన ఆదాయం కంకర మాఫియా చేతుల్లోకి వెళ్లిపోతుందని, తవ్వకాలు నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం వల్లే ఇటువంటి పరిస్థితులు నెలకొందని గుసగుసలు వినిపిస్తున్నాయి . ఎవరైనా ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా అధికారులు ఆయా ప్రాంతాలను సందర్శించి, చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు దృష్టి సారించి కంకర అక్రమంగా తరలిపోకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌గా ఎస్.చంద్రశేఖర్

విశాలాంధ్ర - పాతపట్నం : దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌గా పదోన్నతి పొందిన ఎస్ చంద్ర శేఖర్ ఆదివారం పాతపట్నం నీలమణి దుర్గా అమ్మవారి ని మరియు నీలకంఠేశ్వర స్వామీ ని దర్శించుకున్నారు. జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌గా భాద్యతలు చేపట్టిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి పాత పట్నంలో గల దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆస్తులు గూర్చి స్థానిక ఆలయ ఈఓ ,టి వాసుదేవరావు వివరించారు. ఆయనతోపాటు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, శ్రీముఖలింగం ఈ ఓ ప్రభాకర్ రావు, అలయ రిటైర్డ్ ఈ ఓ డాక్టర్ రమణయ్యతో పాటు ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, కమిటీ సభ్యులు పడ్డ నేతాజీ, సవిరిగాన కృష్ణారావు, ఆలయ అర్చకులు, ఎక్స్ ఆఫీసియో మెంబర్ గానుగుల సంతోష్ కుమార్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లుకు క్రమబద్ధీకరణ చేయాలి

విశాలాంధ్ర - కాశీబుగ్గ : ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లుకు క్రమబద్ధీకరణ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘ జిల్లా నాయకులు హెచ్ రామ్మోహన్ దొర డిమాండ్ చేశారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయం ప్రగతి భవన్ లో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 జూన్ 2 వ తేదీ నాటికి 5 సంవత్సరాలు నిండాలన్న నిబంధన వలన సుమారు 1700 మంది రాష్ట్రంలో క్రమ బద్దీకరణ పరిధిలోనికి రాకుండా మిగిలి పోతున్నారని, వారిని కూడా పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకోవడం పట్ల అధ్యాపకులు ధన్యవాదములు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మంత్రిని కలిసిన వారిలో కె తిరుపతిరావు, కె విజయ్ కుమార్, ఎస్ వీరన్నాయుడు, ఎ.శ్రీనివాసరావు, వై.క్రిష్ణ కుమారి, రామరాజు పాల్గొన్నారు.

తల్లికొడుకులను కలిపిన మనోబంధు..15 ఏళ్ల తర్వాత కలుసుకున్న వైనం

విశాలాంధ్ర - సోంపేట : పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ కుటుంబానికి చెందిన తల్లికొడుకులు 15 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. వారిద్దరి మధ్య కలతలు కొట్లాటలు లేవు. విధివశాత్తు పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలానికి చెందిన గండుపల్లి కామరాజు తల్లి లక్ష్మి 15 ఏళ్ల క్రితం మానసిక స్థితి బాగోలేక రోడ్డుపై తిరుగుతూ కనిపించకుండా పోయింది.అప్పటి నుంచి ఆ కుటుంబీకులు ఎంతగానో ప్రయత్నించినా ఆమె ఆచూకీ కనుక్కోలేకపోయారు. పిచ్చిదానిలా రోడ్లపై తిరుగుతున్న గండుపల్లి లక్ష్మిని మనోబంధు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చేరదీసి విశాఖపట్నంలో గల మెంటల్ ఆసుపత్రిలో చేర్పించారు. కొన్నాళ్ల తర్వాత ఆమె అనారోగ్యం నయమై ఆరోగ్యవంతంగా కోలుకోవడంతో శ్రీకాకళం జిల్లా మనోబంధు సంస్థ అధ్యక్షుడు బీన ఢిల్లీరావు ఆధ్వర్యంలో విశాఖ మెంటల్ ఆసుపత్రిని నుంచి గండుపల్లి లక్ష్మిని సోంపేట వద్ద గల సీతయ్య ఫౌండేషన్‌లో నిర్వహిస్తున్న వృద్ధుల ఆశ్రమానికి ఇటీవల తీసుకు వచ్చి అప్పగించారు. ఈ విషయం పత్రికల్లో ప్రచురితం కావడం, మీడియా ద్వారా బయటకు తెలియడంతో తల్లి ఆచూకీ తెలుసుకున్న లక్ష్మీ కుమారుడు గండుపల్లి కామరాజు పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఇక్కడకు చేరుకుని మనోబంధు ప్రతినిధులను కలిసి వివరాలు తెల్పడంతో వారిని తీసుకు వెళ్లి సీతయ్య ఫౌండేషన్‌లో వసతి పొందుతున్న తల్లి లక్ష్మికి చూపించడంతో ఒక్కసారిగా ఒకరినొకరు చూసి ఆనందబాష్పాలు కార్చుతూ ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఆమెను కుమారుడుకు అప్పగించడంతో ఇద్దరు కలిసి స్వస్థలానికి పయనమయ్యారు. ఈ సందర్భంగా మనోబంధు ప్రతినిధులకు, సీతయ్యఫౌండేషన్ ప్రతినిధులు గుల్ల రమేష్, మోహనరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

వర్సిటీ అభివృద్ధికి అందరి భాగస్వామ్యం అవసరం

వీసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి అందరు భాగస్వామ్యం అవసరమని విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో ఆదివారం నిర్వహించిన 16వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేలా వివిధ కోర్సులను ప్రారంభించామన్నారు. విద్యార్థుల కలలను సాకారం చేసుకునేలా ముందుకు సాగాలన్నారు. ఎంతో చరిత్ర ఉన్న వర్సిటీలతో అభివృద్ధి ఫలితాల సాధనలో పోటీ పడు తున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో వర్సిటీలోనే బోధన, బోధ నేతర సిబ్బంది అంకితభావంతో పనిచేస్తే మరిన్ని విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. వర్సిటీలో రెగ్యులర్ బోధన సిబ్బంది నియా మకానికి ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ఎ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వర్సిటీకి ఉన్న వనరులను వినియోగించుకుని ఉత్తమ ఫలితాల సాధనలో పయని స్తున్నట్లు తెలిపారు. వర్సిటీలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సాధించిన ప్రగతిపై రూపొందించిన న్యూస్ బులిటెన్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ బిడ్డికి అడ్డయ్య, డాక్టర్ చింతాడ రాజశేఖర్, డిన్ డాక్టర్ మురపాన అనురాధ, వర్సిటీ ఇంజనీర్ అంజనీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహిళా క్రికెట్ టోర్నీ

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : స్థానిక సురంగి రాజా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహించిన మహిళల క్రికెట్ టోర్నమెంట్‌లో బ్రహ్మపూర్ ఆల్ఫా క్రికెట్ క్లబ్ పై చేయి సాధించింది. హైదరాబాద్ జి.ఎస్.ఆర్ క్రికెట్ అకా డమీ డైరెక్టర్ సామినేని గోపారావు తల్లిదండ్రులు భానుమతి నర్సింహరావుల జ్ఞాపకార్థం నిర్వహించిన టోర్నమెంట్‌లో పాల్గొన్న జట్ల మధ్య రసవత్తర పోటీ జరిగింది. ఐ.సి.సి అధ్యక్షులు దాసరి రాజు పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లో స్థానిక మహిళల జట్టు ఆల్ఫా జట్టుతో తలపడింది. మొదటి బ్యాటింగ్ చేపట్టిన ఆల్ఫా జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 96 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించగా తరువాత బ్యాటింగ్ చేసిన ఇచ్ఛాపురం మహిళల జట్టు మూడు వికెట్లు కోల్పోయి నిర్ణీత ఓవర్లలో 76 పరుగులకే పరిమితమైంది. నాలుగు ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తీసిన రాపాక సరయు టోర్నీ ఉత్తమ బౌలర్‌గా, మూఏడు ఇన్నింగ్స్ బ్యాటింగ్‌తో 111పరుగులు చేసిన కె.శ్రీలత ఉత్తమ బ్యాట్స్‌ఉమెన్‌గా నిలిచారు. విజేతలకు ఐ.సి.సి ప్రెసిడెంట్ దాసరి రాజు, బత్తుల వెంకటరమణ, రాపాక జగదీష్, ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ చీఫ్ కోచ్ దక్కత గోపి తదితరులు ట్రోఫీలు అందజేసారు.

బీజామృతంలో విత్తనశుద్ధి చేయుటపై అవగాహన

విశాలాంధ్ర - ఆమదాలవలస : మండలం చేపేనపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో వరి విత్తనాలను బీజామృతంలో విత్తన శుద్ధి చేయించారు. సిబ్బంది నక్క చిరంజీవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ముందుగా విత్తనాలను తప్పనిసరిగా బీజామృతం లో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఇలా చేసుకోవడం వలన విత్తనాలకు నేలలో నుండి వచ్చే ఏ విధమైనటువంటి తెగుళ్ల బారిన పడకుండా విత్తనాలకు రక్షణ ఉంటుందన్నారు. అలాగే విత్తనాలు ఇతర బ్యాక్టీరియా మరియు సిలింద్రాల నుండి వ్యాప్తి చెందే తెగుళ్లను తట్టుకుంటాయని, అలాగే ఇతను విత్తనశుద్ధి చేసుకోవడం వలన పూర్తిగా మొలక శాతం వస్తుందన్నారు. అందువలన రైతులందరూ కూడా ప్రకృతి సేద్యంలో మొదటి మెట్టుగా విత్తనాలను శుద్ధి చేసుకుని పొలంలో వేసుకోవడం వలన మంచి ఆరోగ్యకరమైన నారుని అలాగే మంచి ఫలితాలను పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, కృష్ణవేణి అలాగే రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య కరువు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : స్థానిక డిగ్రీ కళాశాలను వివిధ దశల్లో అభివృద్ధిలో నడిపించే ప్రయత్నాలు అధ్యాపక సిబ్బంది చేస్తున్నా ప్రభుత్వ నిర్ణయాలతో పేద విద్యార్థులు చదవుకు దూరమవ్వాల్సిన దుస్థితి దాపురించింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2021-2022 విద్యా సంవత్సరానికి ఉండే ఎం.పి.సి., ఎం.పి.ఎల్ గ్రూపులు విద్యార్థులకు అనుకూలంగా ఉండటంతో ప్రభుత్వ కళాశాల పట్ల అసక్తి ఉన్న వారు దిగువ మధ్య తరగతి కుటుంభాల విద్యార్థులు ఇక్కడే చదువుకోవడానికి ఇష్టపడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎన్.ఈ.పి -2020 నూతన విద్యా విధానంతో పేద విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లతో కూడిన బిఎస్సీ విద్య కరువైపోతుంది. ఈ ఏడాది డిగ్రీ కళాశాల బి.ఎస్సీ విద్యార్థులకు కేవలం మేథ్స్ సబ్జెక్టుకు మాత్రమే అనుమతులున్నందున ఫిజిక్స్ కెమిస్ట్రీలతో బిఎస్సీ చేయాలనుకునే విద్యార్థులు ప్రైవేటు కళాశాలల వైపు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడటం విచారకరమని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికి సుమారు 30 మంది దాకా విద్యార్థులు గత రెండు రోజుల్లో బి.ఎస్సీ పిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టులు లేక విసుపోయి నిరాశతో కళాశాల నుండి వెనుదిరిగారు. ఇటువంటి నిర్ణయాలు ప్రైవేటు యాజమాన్యాలకు కాసులు కురిపించడానికే అన్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులతో కూడిన విద్యను అందించి బలోపేతం చేయకుండా అనాలోచితంగా సబ్జెక్టులు నిలిపివేయడం పేద మధ్య తరగతి విద్యార్థులకు చాలా నష్టం కల్గిస్తుందని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. కళాశాలల కమీషనర్ ఈ విషయమై స్పందించి నిర్ణయం తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.